ఆత్మహత్యలు ఆపకుండా.. అందాల పోటీలా?

ఆటో డ్రైవర్లు, అన్నదాతల ఆత్మహత్యలతో రాష్ట్రం అల్లాడుతుంటే 250 కోట్లతో అందాల పోటీలా

- పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ సర్కార్ పాలన
- బంగారంలాంటి తెలంగాణను కుప్పకూల్చిండు
- తనదాకా వస్తేనే నీతి సూత్రాలు..నైతిక విలువలా?
- కేసీఆర్‌పై ద్వేషంతో రైతులపై పగ సాధిస్తున్న సీఎం
- ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీకి 40 సార్లు కాకుంటే 400 సార్లు పోయి మోదీ, రాహుల్‌గాంధీ కాళ్లు పట్టుకున్నా మాకు అభ్యంతరం లేదు
- మీడియా ఇష్టాగోష్ఠిలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రైజింగ్ తెలంగాణ అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వంలో రూ.71 వేల కోట్ల ఆదాయం ఎందుకు తగ్గిందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. 'తెలంగాణ రైజింగ్ అంటూనే ఈ తగ్గింపు ఏమిటి? ఇది ముమ్మాటికీ తెలంగాణ ఫాలింగ్. ఇంతకంటే రాష్ట్రానికి ఘోరమైన అవమానం ఇంకోటి ఉండదు' అని ధ్వజమెత్తారు. బంగారం లాంటి తెలంగాణను క్యాన్సర్‌తో పోలుస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం అసెంబ్లీ లాబీలో కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ అనుసరిస్తున్న తీరును, చేస్తున్న పాలనను తూర్పారబట్టారు. రాష్ట్ర ఆదాయం రూ.71 వేల కోట్లు తగ్గినట్టు సాక్షాత్తు ముఖ్యమంత్రే ఒప్పుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయం, పెట్టుబడులు, పరిశ్రమలు పెరుగుతున్నాయని ప్రభుత్వం గొప్పగా చెప్తుంటే మరి ఈ అదాయం ఎలా తగ్గిందని ప్రశ్నించారు. బడ్జెట్ కన్నా ముందే రేవంత్‌రెడ్డి నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గిందని తన ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ముఖ్యమంత్రే ఒప్పుకొన్నారని ఉదహరించారు. సీఎం రేవంత్‌కు నిర్మించటం చేతకాదని, కూలగొట్టడమే తెలుసని ఎద్దేవా చేశార. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే తెలివి సీఎంకు లేదని దెప్పిపొడిచారు. 'గాల్లో మేడలు కట్టడం లేదు. మేము వాస్తవిక బడ్జెట్ పెడ్తున్నమని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క గొప్పగా చెప్పిండ్రు. కానీ, జరుగుతున్నదేమిటి?' అని ప్రశ్నించారు.

రాష్ట్రం అప్పులపాలైందని చెప్పి అందాల పోటీలా?

రైతు ఆత్మహత్యలతో రాష్ట్రం అల్లాడుతుంటే అందాలాపోటీలా? అని కేటీఆర్ నిలదీశారు. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో పెట్టడం వల్ల రాష్ట్రానికి కలిగే లాభం ఏమిటని ప్రశ్నించారు. 'రాష్ట్రం అప్పులపాలైందని చెప్పి, అందాల పోటీలు పెడతారా? మింగ మెతుకు లేదు. మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు ఉన్నది అందాల పోటీల కథ' అని ఎద్దేవా చేశారు. రూ.46 కోట్లతో ఫార్ములా ఈ-రేసుతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని చెప్పినా వినకుండా అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ ఇప్పుడు రూ.250 కోట్లతో అందాల పోటీలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఫార్ములా ఈ-రేస్ వల్ల రాష్ట్రానికి జరిగిన లాభం గురించి తాను వివరించానని చెప్పారు. ఫార్ములా ఈ-రేస్ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేయటం వల్ల రాష్ట్రానికి రూ.46 కోట్లు నష్టం జరిగిందని, అందుకు రేవంత్ కారణమని ధ్వజమెత్తారు. ఒప్పందం రద్దుతో రాష్ట్ర ఖజానాకు నష్టమని తెలిసినా కావాలనే రేవంత్ రద్దు చేశారని విమర్శించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తామని, ఫార్ములా ఈ రేసు రద్దుపై విచారణ చేపడతామని వెల్లడించారు. అందాల పోటీలకు పెట్టే సొమ్ముతో బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవచ్చని, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీనైనా నిలబెట్టుకోవచ్చని సూచించారు.

> ఓ వైపు రైతులు, ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలతో అల్లాడుతున్న రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించటం సిగ్గుచేటు. ఆ అందాల పోటీలతో ఊరూరా బ్యూటీపార్లర్లు ఏమైనా పెడుతరా? వాటి వల్ల ఎవరికి లాభమో సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలె. రాష్ట్రం తీవ్ర కరెంట్, వ్యవసాయ సంక్షోభంలో చిక్కుకుంటే.. సర్కారు ఫోకస్ మొత్తం అందాల పోటీల మీద పెట్టడం విషాదకరం.
> -కేటీఆర్

ఈ రోజు గుర్తొచ్చిందా రేవంత్

రేవంత్ ఇప్పుడు నీతి సూత్రాలు మాట్లాడుతున్నారని, విషయం తనదాకా వస్తేగాని తెలియదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, కుటుంబ సంబంధాలు, పరువు, ప్రతిష్ట వంటి భారీ డైలాగులు కొడుతున్న రేవంత్‌రెడ్డి గతంలో చేసిందేమిటో చెప్పాలని నిలదీశారు. 'రేవంత్‌కు ఈ రోజు కుటుంబం గుర్తుకొచ్చిందా? మరి మాకు సంబంధాలు అంటగట్టినప్పుడు.. మా పిల్లలను రాజకీయాల్లోకి లాగి నానా మాటలు అన్నప్పుడు ఆ విలువలు గుర్తుకు రాలేదా?' అని ప్రశ్నించారు.

కేసీఆర్‌పై ద్వేషంతోనే కాళేశ్వరం బంద్

కేసీఆర్ మీద ఉన్న కోపంతో కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టి పంటలను ఎండబెట్టడం వల్లే ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం నుంచి కాంట్రిబ్యూషన్ తగ్గిందని కేటీఆర్ చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని వివరించారు. పట్టణాలు, గ్రామాల్లో ఆర్థిక పరిస్థితి దిగజారడానికి కారణం పూర్తిగా రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. బడ్జెట్‌లో కోతతో ఈ నిజం కాబోతున్నదని చెప్పారు. కేసీఆర్‌పై ద్వేషంతో వ్యవసాయాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏడాది నుంచీ రేవంత్ చేసిందంతా నెగటివ్ పాలిటిక్స్, అక్రమ నిర్బంధాలు, తెలంగాణకు కాన్సర్ అంటూ రాష్ట్ర పరువు తగ్గించడం వంటి అడ్డమైన మాటల వల్లే రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది' అని వాపోయారు.

పిచ్చోడి చేతిలో రాయిలా పాలన

రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ సీఎం అయిన తొలి ఏడాదిలోనే అన్ని రంగాల్లో ఫెయిల్ అయిండని తన మాటలతోనే తేలిపోయిందని ఎద్దేవాచేశారు. ఎలాంటి ఆర్థిక మాంద్యం లేకుండానే, కొవిడ్ వంటి సంక్షోభం లేకుండానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంతో బీఆర్‌ఎస్ నిత్యం తగువు పెట్టుకోవటం వల్ల రాష్ట్రానికి ప్రయోజనాలు దక్కకుండా పోయాయని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇవ్వాళ కేంద్రంతో మంచిగా ఉండి తెలంగాణకు అదనంగా తెచ్చిందేమిటని నిలదీశారు.

సమైక్యాంధ్ర నేతల ఆరోపణలను నిజం చేస్తున్న రేవంత్

తెలంగాణ ప్రజలు విచక్షణతో యోచించి తమకు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, ఫలితంగా కేసీఆర్ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశారని కేటీఆర్ పేర్కొన్నారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆగమైతది. వీళ్లకు ఉద్యమాలు చేయటం తప్ప పరిపాలించటం చేతకాదు. వారికి నాయకత్వ లక్షణాలు లేవు' అని నాడు సమైక్యాంధ్రనేతలు పేర్కొన్నట్టే రేవంత్‌రెడ్డి నిరూపిస్తున్నారని విమర్శించారు. ఒకవేళ 2014లో రేవంత్‌రెడ్డే అధికారాన్ని చేపట్టి ఉంటే తెలంగాణను విఫల రాష్ట్రంగా చేసేవాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలన చూస్తుంటే సమైక్యాంధ్ర పాలకుల ఆరోపణలను నిజం చేస్తున్నాడనే ఆందోళన కలుగుతున్నదని వాపోయారు.

గాసిప్స్ మీదున్న దృష్టి గవర్నెన్స్ మీదేది?

సీఎం రేవంత్‌రెడ్డికి గాసిప్స్ మీదున్న దృష్టి గవర్నెన్స్ మీద లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ ముఠా టీడీఆర్ స్కాం చేయబోతున్నదని చెప్పారు. తాను చెప్పేది నిజమో కాదో రేవంతే చెప్పాలని డిమాండ్ చేశారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్‌ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అసెంబ్లీలో ఎండగట్టారని పేర్కొన్నారు. విదేశాల్లో చదువుకోడానికి వెళ్లిన 7 వేల మందికి పైగా తెలంగాణ బిడ్డలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను తాము అసెంబ్లీ దృష్టికి తెచ్చామని వివరించారు.

జర్నలిస్టులకు ఇచ్చే గౌరవం ఇదేనా?

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తనకు అవకాశం ఉన్నప్పుడు ఒకరకంగా, లేనప్పుడు మరోరకంగా జర్నలిస్టుల పట్ల వ్యవహరించటం రేవంత్‌కు అలవాటైందని తేలిపోయిందన్నారు. నాడు యూట్యూబర్లంతా రేవంత్‌కు జర్నలిస్టులుగా కనిపించి ఈ రోజు ఎందుకు జర్నలిస్టులు కాకుండా పోయారని ప్రశ్నించారు. జర్నలిస్టులను జర్నలిస్టులే కాదని వారి పట్ల అమర్యాదగా రేవంత్ ప్రదర్శిస్తున్న తీరును ఖండించారు.

> అసెంబ్లీలో విలువలు అని చిలక పలుకులు మాట్లాడిన రేవంత్.. స్టేషన్ ఘన్‌పూర్‌లో బజారు భాష మాట్లాడిండు. మాకు అంతకన్నా దిగజారుడు భాష తెలుసు. మేము తలుచుకుంటే రేవంత్ బట్టలు విప్పగలం. రేవంత్ దాటిన రేఖలు.. తారలు.. వాణీల గురించి మాట్లాడగలం. మేము నోరు విప్పితే రేవంత్‌కు ఇంట్లో అన్నం కూడా పెట్టరు. మేమూ సాగర్ సొసైటీ, మైహోం భుజా వ్యవహారాల గురించి మాట్లాడగలం. ఇంకా ఎక్కువ మాట్లాడితే ఫొటోలు కూడా బయట పెడుతం. రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రైవేట్ కార్ల వివరాలన్నీ చెప్తం. -కేటీఆర్

> రేవంత్‌కు ఈ రోజు కుటుంబం గుర్తుకొచ్చిందా? మాపై దారుణంగా, అసహ్యంగా మాట్లాడారు. ఆయనకు కుటుంబాలు, ఫ్యామిలీలు లేవా? అని రేవంత్ ఇప్పుడు మాట్లాడుతున్నడు. మరి మాకు సంబంధాలు అంటగట్టినప్పుడు.. మా పిల్లలను రాజకీయాల్లోకి లాగి నానా మాటలు అన్నప్పుడు ఆ విలువలు గుర్తుకు రాలేదా? – కేటీఆర్

రాహుల్ ఇప్పుడెందుకు సెంట్రల్ వర్సిటీకి రాడు?

భూములు అమ్మకూడదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారని, గతంలో ఇదే వర్సిటీకి అనేకసార్లు వచ్చిపోయిన రాహుల్ గాంధీ ఇప్పుడెందుకు రారని కేటీఆర్ ప్రశ్నించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకంపై రాహుల్ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీతో రహస్యభేటీని ఖండించలేదెందుకు?

సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నేతలతో రహస్యభేటీ అయ్యారని, స్వయంగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ బహిరంగంగా చెప్పినా దీనిపై రేవంత్ ఎందుకు స్పందించలేదని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీతో రేవంత్‌కు ఉన్న సంబంధాలు, భవిష్యత్తు బంధాలపై అందరికీ స్పష్టత ఉన్నదని చెప్పారు. ఆ భేటీపై ఇటు రేవంత్, అటు బీజేపీ నేతలు ఎందుకు స్పందించటం లేదని నిలదీశారు.

అభినవ గాడ్సే సీఎం రేవంత్

సీఎం రేవంత్‌ని అభినవగాడ్సేగా కేటీఆర్ అభివర్ణించారు. రేవంత్‌లో జాతిపిత మహాత్మాగాంధీని చంపిన గాడ్సే మూలాలున్నాయని విమర్శించారు. తెలంగాణ జాతిపితలాంటి కేసీఆర్ మీద రేవంత్ చిల్లరమల్లర మాటలకు మూలం అదేనని పేర్కొన్నారు.

నాకు 79 ఏండ్లు కంప్లీట్

కేటీఆర్‌తో జానారెడ్డి సరదా సంభాషణ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తేతెలంగాణ) : కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య అసెంబ్లీ ఆవరణలో సోమవారం సాయంత్రం కాసేపు సరదా సంభాషణ కొనసాగింది. నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. అనంతరం జానారెడ్డి మీడియాతో మాట్లాడి వెళ్తుండగా అదే సమయంలో అటుగా వచ్చిన కేటీఆర్.. జానారెడ్డిని చూసి ఆయన వద్దకు వెళ్లారు. 'మీ ఆరోగ్యం ఎలా ఉన్నది' అంటూ జానారెడ్డిని అడిగారు. అందుకు ప్రతిస్పందనగా 'నా ఆరోగ్యం బాగున్నది. నా ఏజ్ ఎంత ఉంటుందో మీకు తెలుసా?' అని జానారెడ్డి అడుగగా.. 70 ఏండ్లకు పైగా ఉండొచ్చనుకుంటున్నానంటూ కేటీఆర్ సమాధానమిచ్చారు. దీనికి జానారెడ్డి స్పందిస్తూ.. 'కాదు.. నాకు 79 ఏండ్లు పూర్తయ్యాయి' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. 'మీ అనుభవాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి మంచి సలహాలు ఇవ్వండి' అని జానారెడ్డిని కేటీఆర్ కోరారు. వాళ్లను ఫొటో తీసేందుకు పలువురు ఫొటోగ్రాఫర్లు ముందుకు రాగా ' మా జానారెడ్డితో ఫొటో దిగేందుకు భయం లేదు' అంటూ ఆయనతో కలిసి కేటీఆర్ ఫొటో దిగారు.



కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రణకు మద్దతివ్వండి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సీపీఎస్‌ఎస్ వినతి

హైదరాబాద్, మార్చి17 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉద్యమానికి మద్దతివ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి (సీపీఎస్‌ఎస్) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సమితి అధ్యక్షుడు పరశురామ్ అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ ఫొటోను ముద్రించాలనే డిమాండ్‌తో 26న ఢిల్లీలో వందలాది కళాకారులతో '' ధూం ధాం'' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ న్యాయమైన డిమాండ్‌కు సంపూర్ణ మద్దతూ తెలిపాలని కోరారు. దీనిపై కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్టు పరశురామ్ వెల్లడించారు.

విద్యార్థి ఉరేసుకొనే పరిస్థితి ఎందుకొచ్చింది?

అసెంబ్లీలో నిలదీసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): తన నియోజకవర్గం దుబ్బాకలోని జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదివే విద్యార్థి ఉరేసుకొనే పరిస్థితి ఎందుకు వచ్చిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఘటన జరిగిన మూడు రోజులు అవుతున్నా విషయం బయటకు పొక్కకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని నిలదీశారు. విషయాన్ని బయటికి చెప్తాందంటూ వార్డెన్‌ను కలెక్టర్, ఆర్డీవో హెచ్చరించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలో గురుకుల పాఠశాలల్లో వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని, 15 నెలల్లో 83 మంది విద్యార్థులు చనిపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. ఫుడ్ పాయిజన్, పాము కాటు నిత్య కృత్యంగా మారాయని చెప్పారు. గురుకులాల్లో పరిస్థితులను మార్చాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క స్పందిస్తూ అస్వస్థతకు గురైన దుబ్బాక గురుకుల విద్యార్థికి హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానలో చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థుల సంరక్షణ, గురుకులాల బలోపేతానికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు.

కుక్క దాడిలో గురుకుల విద్యార్థినికి తీవ్రగాయాలు

- దవాఖానకు తరలింపు
- స్కూల్ ఆవరణలోనే ఘటన
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన

సిరిసిల్ల రూరల్, మార్చి 17: కుక్క దాడిలో విద్యార్థినికి తీవ్రగాయాలైన ఘటన సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల బాలికల గురుకుల స్కూల్లో సోమవారం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన గొట్టిముక్కుల డేవిడ్‌రాజ్ – కృపారాణి కూతురు సువర్ణ (10) చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నది. సోమవారం బాత్‌రూం వెళ్లేందుకు పాఠశాల గది నుంచి బయటకు వచ్చి మళ్లీ లోపలికి వెళ్లే సమయంలో ఓ కుక్క దాడి చేసింది. విద్యార్థిని కేకలు వేయడం, తోటి విద్యార్థినులు చెదరగొట్టడంతో కుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. సువర్ణను వెంటనే సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. స్కూల్ యాజమాన్యం, వాచ్‌మెన్ నిర్లక్ష్యంపై తల్లిదండ్రులతో పాటు బీఎస్పీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ మండిపడ్డారు.

రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

చిన్న బోనాల గురుకుల స్కూల్లో విద్యార్థినిపై కుక్క దాడి ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి గాయపడిన ఘటన రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యాశాఖకు బాధ్యత వహిస్తున్న రేవంత్‌రెడ్డి పాలనలో చావు కేకలు పెడుతున్నాయన్నారు. గురుకుల బిడ్డల రోదనలే శాపాలై నీతిలేని అతని పాలనకు చరమగీతం పాడుతాయని హెచ్చరించారు.

పసుపు రైతుకు 'మద్దతు' ఇవ్వాలి

- నాడు క్వింటాలు పసుపు ధర రూ.16 వేలు.. నేడు రూ.8, 9 వేలే పలుకుతున్న దైన్యం
- మ్యానిఫెస్టో మేరకు 13 వేలివ్వాలి
- శాసనసభ జీవోఅవర్‌లో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- అసెంబ్లీలో పలు సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): పసుపుబోర్డు ఏర్పాటైనప్పటికీ రాష్ట్రంలోని పసుపు రైతులకు అన్యాయమే జరుగుతున్నదని బీఆర్‌ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. బోర్డు రాకముందు క్వింటా పసుపు రూ.16 వేల వరకు ధర ఉండగా, ఈ సీజన్‌లో క్వింటాకు రూ.8 నుంచి రూ.9 వేలే పలుకుతున్నదని మండిపడ్డారు. ఖరీదుదారులు సిండికేటుగా మారి రైతులకు మద్దతు ధర దక్కకుండా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభ సమావేశాల్లో జీరో అవర్‌లో భాగంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు.'ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, ఆర్మూరు, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, జగిత్యాల, నిర్మల్, ముధోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పసుపు రైతులు నిజామాబాద్ మార్కెట్‌లోనే తమ ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.8 నుంచి రూ.9 వేలే పలుకుతుంది. ఇదే పసుపు మహారాష్ట్ర సాంగ్లి మార్కెట్‌లో రూ.13 నుంచి రూ.14 వేల ధర వస్తున్నది. దళారులు, ఖరీదుదారులు కుమ్మక్కై రైతుల నుంచి తక్కువ రేటుకు కొంటున్నరు. పసుపు బోర్డు వచ్చినంక మద్దతు లభిస్తుందని, మాకు న్యాయం జరుగుతుందని రైతులు భావించారు. కానీ, సగానికి రేటు పడిపోయింది. ఖరీదుదారుల సిండికేట్ కుట్రలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సాంగ్లి మార్కెట్ తరహాలో ధర వచ్చేలా చొరవచూపాలి. రూ.13 వేలకు ఎంత తగ్గినా, కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం ఆ తగ్గిన నగదును రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలి' అని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

గోదావరిలో సీవరేజీ నీళ్లు కలవొద్దు: అల్లూరి లక్ష్మణ్‌కుమార్

పవిత్రమైన గోదావరిలో సీవరేజీ నీళ్లు కలవకుండా చర్యలు తీసుకోవాలని, దీనికోసం నిధులు కేటాయించాలని ధర్మపురి బీజేపీ ఎమ్మెల్యే అల్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభ జీరోఅవర్‌లో ఆయన మాట్లాడుతూ బాసర, ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు ఉన్న గోదావరి తీరాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పదేండ్లలో సీఎం కేసీఆర్ యజ్ఞాలు, యాగాలు చేశారని గుర్తుచేశారు. కేంద్ర మంత్రులు సైతం వచ్చి గంగాహారతి ఇచ్చారని తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలు రానున్నాయని, ఇందుకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

84 ప్రశ్నలడిగితే ఎనిమిదింటికే సమాధానాలు: వెంకటరమణారెడ్డి

అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతున్నదని బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. గడిచిన 15 నెలల్లో 84 ప్రశ్నలు అడిగితే ఎనిమిది ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇచ్చారని, మిగతా వాటిపై ఎలాంటి జవాబు ఇవ్వలేదని మండిపడ్డారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద 86 ప్రశ్నలు అడిగితే 9 శాతం ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన సమాధానాలు కూడా సంపూర్ణంగా లేవని చెప్పారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేని అసమర్థ ప్రభుత్వం ఎవరిది? అని ప్రశ్నించారు. సభ్యుల ప్రశ్నలకే సమాధానం ఇవ్వలేకపోతే, ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారని నిలదీశారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేను గుర్తించకుండా ఇన్‌చార్జి మంత్రి పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు.

పటాన్‌చెరు డంప్‌యార్డును ఎత్తివేయాలి

సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్

పటాన్‌చెరు సమీపంలో ఏర్పాటు చేయాలనుకున్న డంప్‌యార్డ్‌ను ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభ జీఆరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ 3 మండలాలపై తీవ్ర ప్రభావం చూపనున్న ఈ డంప్‌యార్డును పోలీసుల పహారాలో ప్రజలను నిర్బంధించి ఏర్పాటు చేయాలని చూడటం తగదని హితవు పలికారు. 47 రోజులుగా రైతులు నిరాహార దీక్షలు చేస్తుంటే, 144 సెక్షన్ విధించి అదే రైతులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. కూరగాయలు పండించుకొనే రైతుల భూములు, చెరువు కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నదని చెప్పారు. డంప్‌యార్డ్ నిలిపివేత కోరుతూ రైతులు కోర్టుకు వెళ్లారని, కోర్టు సైతం సానుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. తక్షణమే డంప్‌యార్డు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల భర్తీపై రేవంత్ ఝూటామాటలు

15 నెలలైనా రెండు లక్షల ఉద్యోగాలేవీ: కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్ సభలో ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ ఝూటా మాటలు మాట్లాడారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. 'ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, 15 నెలలైనా ఎందుకివ్వలేదు? జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదేందుకు? ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదేందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

సీఎం మాటలు సిగ్గుచేటు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను దూషించడం దుర్మార్గం: కాట్రగడ్డ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరం. ఆయనను దూషించిన తీరు పత్రికల్లో చూసి చాలా బాధ పడ్డా.. నా పార్టీ ఏదైనా సీఎం వాడిన పదజాలం విని సిగ్గుతో తలదించుకుంటున్నా' అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మహిళా నేత కాట్రగడ్డ ప్రసూన భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయాలంటే ఇంత హీ నంగా ఉండాలా? వ్యక్తిగత విమర్శలు చేసుకోవాలా? వాడరాని భాషను వాడి కించపరచలా? అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం ఆమె మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. దేశంలోని అన్ని పార్టీలను ఏకం చేసి తెలంగాణ సాధించి.. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన నేతను ఈ విధంగా తూలనాడటం సరికాదన్నారు. కేసీఆర్‌తో 18 ఏండ్లు కలిసి పని చేశానని, ఆయన ఉపన్యాసాలు విని స్ఫూర్తిపొందానని చెప్పారు. 'వ్యక్తిగత విషయాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదు.. సీఎం ఇలాంటి సిగ్గుమాలిన వ్యాఖ్యలతో రాజకీయాలు చేయొద్దు..' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులతో పోటీపడాలని చురక లంటించారు.

ఫలించిన పల్లా కృషి

దేవాదుల మూడో ఫేజ్ పంపులు ప్రారంభించనున్న సర్కారు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): దేవాదుల మూడో ఫేజ్ పంపులను ప్రారంభించాలని జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఫలించింది. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్ రిజర్వాయర్లను నింపి నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులకు సాగునీరు ఇవ్వాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరారు. జనగామ నియోజకవర్గంలోని దేవాదుల పరిధిలోని 50% ఆయకట్టులోని పంటలు పూర్తిగా ఎండిపోయాయి. పల్లా మంత్రి, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నెల రోజుల నుంచి ప్రభుత్వం పంపులను రన్ చేయలేదు. దీంతో అసెంబ్లీ వేదికగా పల్లా సమస్యను లేవనెత్తారు. బీఆర్‌ఎస్ కృషి, ఎమ్మెల్యే పల్లా ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం బుధవారం నుంచి దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే మూడో ఫేజ్ పంపులను ఆన్ చేయాలని నిర్ణయించింది.

కాళేశ్వరం బరాజ్‌లు 'సేఫ్'

మొదటిపేజీ తరువాయి...

పడావుబెడుతూ వచ్చారు. కానీ, ఇప్పుడు అమాత్యులు మాట మార్చారు. వాస్తవాలను వెల్లడించారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూలిపోతాయనేది అవాస్తమని తేల్చిచెప్పారు. శాసనమండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'మేడిగడ్డ బరాజ్ మాదిరిగా సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు కూలిపోతాయని నిపుణులు అభిప్రాయపడిన విషయం వాస్తవమా? కాదా?' అని శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీలు కోదండరాం, జీవన్‌రెడ్డి ప్రశ్నించగా.. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆ బరాజ్‌లు 'సేఫ్' అని తేల్చిచెప్పారు. అదేవిధంగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణం విషయమై పలు ప్రత్యామ్నయ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్ర సీఎంతో పాటు ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో సంప్రదింపులు జరపనున్నట్టు వెల్లడించారు.

సీతారామ ప్రాజెక్టు పురోగతి...

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే నిధుల అంచనాలు ఎలా పెరిగాయో లిఖితపూర్వక సమాధానంలో వివరించారు. ప్రాథమిక నివేదికలో 9,000 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 18,000 ఎకరాల భూసేకరణ అవసరమైందని పేర్కొన్నారు. పెరిగిన అదనపు భూసేకరణ, విద్యుత్తు సబ్‌స్టేషన్లు, జీఎస్టీ కలిపి రూ.13,057 కోట్ల నుంచి రూ.19,465 కోట్లకు అంచనాలు పెరిగాయని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు పురోగతిని తెలిపారు. 114 కిలోమీటర్ల మెయిన్ కెనాల్‌లో ఇప్పటి వరకు 104 కిలోమీటర్లు పూర్తయినట్టు చెప్పారు. పాలేరు లింకు కెనాల్ పనులు 32 శాతం పూర్తయ్యాయని, డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్‌కు సంబంధించి 8 ప్యాకేజీలకు బదులుగా 4 ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిచామని వివరించారు. మరో 3 ప్యాకేజీలకు ఆమోదం లభిస్తుందని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ 18 ఎల్ పూర్తయిందని వెల్లడించారు. రానున్న రెండేండ్లలో ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్టు తెలిపారు.

156.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం...

2024-25 ఖరీఫ్ సీజన్‌లో 156.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని తెలిపారు. అందులో 53.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. అందుకోసం రూ.12,511.76 కోట్లు చెల్లించినట్టు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాగా, పంట సీజన్ 20 రోజులు పెరగడంతో రాష్ట్రంలో సాగునీటి సమస్య తలెత్తిందని మీడియాతో చిట్‌చాట్‌లో పేర్కొన్నారు.